SARMAYADARI, ISHTERAKIYAT AUR ISLAM
(Telugu)

పెట్టుబడిదారీ సామ్యవాదం ఇస్లాం

మూలం:

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది

అనువాదం:

అబ్దుల్ వాహెద్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

పెట్టుబడిదారీ, సామ్యవాదం, ఇస్లాం

పెట్టుబడిదారీ వ్యవస్థ

పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆధారభూతమయిన సిద్ధాంతం గురించి సూటిగా, సరళంగా చెప్పాలంటే- ప్రతి మనిషీ తాను సంపాదించిన మొత్తానికి తానొక్కడే స్వామి. అతని సంపాదనలో వేరెవరికీ ఎలాంటి హక్కూ లేదు. తాను సంపాదించిన సొమ్ము ఏ విధంగానయినా సరే వాడుకునే అధికారం అతనికి పూర్తిగా ఉంది. తన చేతికందిన ఆదాయ వనరులను తన అదుపులో ఉంచుకునే హక్కు అతనికి ఉంది. తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేకపోతే వాటిని వినియోగించేందుకు నిరాకరించే అధికారమూ అతనికి ఉంది. మానవ ప్రవృత్తిలో నిబిడీకృతమయిన 'స్వార్థప్రియత్వం' ఈ సిద్ధాంతానికి నాందీవాచకమయితే అది ఎదిగి, చివరకు మానవ సమాజ శ్రేయస్సుకు, అభ్యుదయానికి కావలసిన మానవ లక్షణాలను అణచివేయడం దాని పరకాష్ఠ. నైతిక దృక్కోణాన్ని ఆవల ఉంచి ఆర్థిక దృక్కోణంతో చూసినా ఈ సిద్ధాంతం వల్ల చివరకు వాటిల్లే ఫలితాలు- సంపద పంపిణీలో సమతుల్యం దెబ్బతినడం, ఆదాయ వనరులు క్రమేణా అదృష్టవంతుల చేతిలోగాని, లేదా తెలివితేటలు అధికంగా ఉన్న వర్గాల చేతుల్లోగాని కేంద్రీకృతం కావడం, సమాజం రెండు విభిన్న వర్గాలుగా చీలిపోవడం, ఒకటి ఉన్నవారిది, మరొకటి లేనివారిదీనూ. భాగ్యవంతుల వర్గం అన్ని ఆదాయ వనరులపై ఆధిపత్యాన్ని, స్వాధీనతను పొంది వాటిని కేవలం తన వ్యక్తిగత లాభానికి వాడుకుంటూ, తన సంపదను మరింత పెంచుకొనే ప్రయత్నంలో సామాజిక ప్రయోజనాలను సయితం బలిపెట్టడానికి పాల్పడుతుంది. ఇక నిరుపేద వర్గం విషయానికి వస్తే వారికి ఆదాయ వనరులలో ఎలాటి భాగాన్ని పొందే అవకాశమే లభించదు. పెట్టుబడి

దారుల ప్రయోజనాల కోసం వారికి ఇతోధిక సేవలు చేస్తూ తమ కనీస జీవితావసరాలను పొందడం తప్ప మార్గాంతరం లేదు. ఇలాంటి ఆర్థిక వ్యవస్థ ఓ వైపు షావుకార్లను, కార్ఖానాదారులను, జమీందారులను మరో వైపు శ్రామికులను, కర్షకులను, ఋణగ్రస్తులను పుట్టిస్తుంది.

సమాజంలో సానుభూతి, పరస్పర సహకారం లాంటి భావాలు మటుమాయమయిపోవడం అన్నది ఇలాంటి వ్యవస్థలో సహజ పరిణామం. ప్రతి మనిషి కేవలం తన వ్యక్తిగత వనరులపై ఆధారపడి జీవితం గడపవలసిన నిస్సహాయ స్థితిలో ఉంటాడు. ఎవరూ మరెవరికీ సహకరించేవాడు, సహాయపడేవాడు కాడు. అగత్యపరుల పాలిట ఈ ఆర్థిక వ్యవస్థ మరింత ఇరుకుగా మారిపోతుంది. సమాజంలోని ప్రతి వ్యక్తి తన జీవితాన్ని గడపటం కోసం ఇతరుల పట్ల శత్రువైఖరి వహించి తీవ్రపోరాటాన్ని సలపవలసివస్తుంది. ప్రతి వ్యక్తి అత్యధికంగా ఆదాయ వనరులను పొందేందుకు, తన లాభం కొరకు వాటిని చేతిలోనే నిలుపుకునేందుకు, కేవలం సంపద పెంచుకోవడానికి మాత్రమే వినియోగించేందుకు ప్రయత్నిస్తాడు. ఈ పోరాటంలో ఓడిపోయినవాళ్ళు, ఈ పోరాటంలో పాల్గొనే శక్తి లేనివారు- ఇలాంటివారికి ప్రపంచంలో ఎలాంటి ఆసరా మిగలదు. బిచ్చమెత్తాలనుకున్నా అదీ అంత సులభంగా దొరకదు. వారి పట్ల జాలి గుండె కానరాదు. వారిని ఆదుకునేందుకు ఏ చెయ్యీ ముందుకు రాదు. వారు ఆత్మహత్యయినా చేసుకుని ఈ జీవితం నుండి విముక్తిని పొందాలి లేదా నేరాలకు పాల్పడి లజ్జావిహీనమయిన విధానాలవలంబించి కడుపు నింపుకునే నిస్సహాయ స్థితికి దిగజారాలి.

ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజలు కేవలం రూపాయలను సంపాదించడంలోనే ఆసక్తి కలిగి ఉండటం తప్పనిసరి. ఆ సొమ్మును వారు కేవలం ఉత్పాదక అవసరాలకు మాత్రమే వాడుకునే ప్రయత్నాలు చేయడం అత్యవసరం. వాటాదారుల పెట్టుబడితో కంపెనీలు, బ్యాంకులు ఏర్పడతాయి. ప్రావిడెంట్ ఫండ్ ఏర్పడుతుంది. ఇన్సూరెన్స్ కంపెనీలు, సహకార సంఘాలు పుట్టుకొస్తాయి. ఈ రకంగా అనుసరించే వివిధ ఆర్థిక కార్యకలాపాలన్నింటిలోనూ అంతరార్థం ఒక్కటే: రూపాయి నుండి మరిన్ని రూపాయలను - అది వ్యాపారిక

లావాదేవీల ద్వారాగాని, లేదా వడ్డీ రూపేణాగాని, ఎలాగయినా సరే- సంపాదించడం. పెట్టుబడిదారీ దృక్కోణంలో వడ్డీకి, వ్యాపారానికి మౌలిక భేదం లేదు. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ రెండు (వడ్డీ, వ్యాపారం) కలగలసిపోవడమే కాదు, వాణిజ్య వ్యవహారాల్లో వాటి స్థాయి పడుగూ పేక ల్లాంటిదయిపోతుంది. వ్యాపారానికి వడ్డీ, వడ్డీకి వ్యాపారం, రెంటికీ అవినాభావ సంబంధం ఏర్పడుతుంది. ఈ రెంటిలో దేనిని విడిచిపెట్టినా రెండవదానికి అభివృద్ధి ఉండదు. వడ్డీయే గనక లేకపోతే పెట్టుబడిదారీ వ్యవస్థ ఛిన్నాభిన్నమయిపోతుంది.

సామ్యవాద వ్యవస్థ

పెట్టుబడిదారీ వ్యవస్థకు సదృశమయిన మరో ఆర్థిక వ్యవస్థ ఉంది. దాన్ని సామ్యవాద వ్యవస్థ అంటారు. దాని మౌలిక సిద్ధాంతం ఇది: అన్ని ఆదాయ వనరులు సమాజపు ఉమ్మడి భాగస్వామ్యంలో ఉంటాయి. అందువల్ల మనిషికి వ్యక్తిగతంగా వాటిపై యాజమాన్యాన్ని కలిగి ఉండే, లేక తన వ్యక్తిగత అభీష్టం మేరకు వాటిని వాడుకునే, లేదా వాటి ద్వారా ప్రాప్తమయ్యే లాభాలను వ్యక్తిగతంగా తానొక్కడే అనుభవించే ఎలాంటి హక్కు ఉండరాదు. ఈ వ్యవస్థలో వ్యక్తి పొంద గలిగేది కేవలం సమాజం ప్రయోజనాలకై అతను పడిన శ్రమకు కూలి మాత్రమే. సమాజం వ్యక్తుల జీవితావసరాలను అందజేస్తుంది. ప్రతిగా వ్యక్తులు సమాజం కొరకు పని చేస్తారు.

ఈ సిద్ధాంతం ఆర్థిక వ్యవస్థను మరో రూపంలో వ్యవస్థీకరిస్తుంది. ఇది మౌలికంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు భిన్నమయినది. ఈ వ్యవస్థలో వ్యక్తిగత యాజమాన్యం అన్న ప్రసక్తే లేదు. ఇక ఎవరయినా రూపాయలు ప్రోగుచేసే, వాటిని సొంత వ్యాపారంలోపెట్టే అవకాశమేది? ఇక్కడ సిద్ధాంతంలోని సూత్రాలలో విభేదం ఏర్పడటం వల్ల మార్గాలు మారిపోయాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, జాయింట్ స్టాక్ కంపెనీలు లాంటి సంస్థలు లేకుండా పని చేయలేదు. కాని సామ్యవాద విధానంలోని ఆర్థిక వ్యవహారాలలో ఇలాంటి సంస్థలకు అవకాశమూ లేదు. అవసరమూ లేదు. పెట్టుబడిదారీ నైజంలో వడ్డీకి

ఎంత గట్టి అనుకూలత ఉందో, సామ్యవాద నైజంలో దీనికి అంతకన్నా తీవ్రమైన అననుకూలత ఉంది. సామ్యవాదం, ఓ వ్యక్తి వడ్డీని ఇస్తే మరో వ్యక్తి వడ్డీని పుచ్చుకునే పద్ధతినే సమూలంగా పెకలించివేస్తుంది.

ఈ వ్యవస్థ నియమాలు వడ్డీని ఏ రూపంగానూ, ఏ విధంగానూ న్యాయ మయినవిగా భావించవు. ఈ నియమాలను విశ్వసించే వ్యక్తి వడ్డీని ఇవ్వడం లేదా పుచ్చుకోవడం చేస్తూ, అదే సమయాన సామ్యవాదిగానూ ఉండటం సాధ్యం కాని విషయం.★

సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం పరస్పరం విరుద్ధమయిన రెండు అతివాదాలు. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యక్తులకు, వారి సహజ హక్కులను ఇవ్వడం వాస్తవమేకాని, దాని నియమాలు, సిద్ధాంతాలలో వ్యక్తులను ఉమ్మడి సామాజిక ప్రయోజనాల కొరకు పనిచేయడానికి ఆయత్తపరిచే, ఇంకా అవసరం మేరకు ఒత్తిడి చేసే ఏర్పాటు ఏదీ లేదు. పైగా వాస్తవానికి ఈ వ్యవస్థ వ్యక్తుల్లో స్వార్థ ప్రియత్వాన్ని పుట్టిస్తుంది. దానివల్ల ప్రతి మనిషి తన సొంత లాభం కొరకు సమాజానికి ఎదురుతిరిగి క్రియాత్మకంగా పోరాడుతాడు. చివరకు వనరుల విభజనలోని సమతుల్యం కూడా దెబ్బతింటుంది. ఓ వైపు కొద్ది మంది అదృష్ట వంతులు అన్ని ఆదాయ వనరులను ప్రోగుచేసుకుని లక్షాధికారులుగా, కోటీశ్వరులుగా తయారవుతారు. తమ పెట్టుబడి బలంతో మరింత సంపదను కూడబెట్టుతుంటారు. మరోవైపు సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితి వాటన్నిటికి తీసికట్టు నాగంబొట్టుగా తయారవుతుంది. సంపద పంపిణీలో వారి భాగం

★ ఇక్కడ మేము కేవలం సిద్ధాంతాల గురించి మాట్లాడుతున్నాం. కాని ఆచరణాత్మకంగా సామ్యవాద వ్యవస్థ రష్యాలో అనేక పిల్లి మొగ్గలు వేసింది. తన అతివాద సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడంలో విఫలమయి, పెట్టుబడిదారీ విధానంలోని వివిధ పద్ధతుల వైపునకు మొగ్గుచూపడం ప్రారంభించింది. కాబట్టి అక్కడ తమ అవసరాల కన్నా అధికంగా సొమ్ము పొందుతున్నవారు అధిక ధనాన్ని కూడబెట్టడం సాధ్యమైంది. దానిని బ్యాంక్‌లో ఉంచి వడ్డీని పొందడమూ సాధ్యపడింది.

క్రమేణా క్రుశించిపోతూ చివరికి శూన్యమయిపోతుంది. ప్రారంభంలో పెట్టుబడిదారుల సంపద ఘనమయిన ప్రదర్శనలతో సమాజంలో కళ్ళు జిగేల్ మనిపించే వంచనాపూర్వకమయిన ఆకర్షణను తప్పక సృష్టిస్తుంది. కాని, సంపద పంపిణీలోని అసమతుల్యం వల్ల చివరకు ఆర్థిక వ్యవస్థ అనే శరీరంలోని రక్త ప్రసరణ నిలిచిపోతుంది. ఆ శరీరంలోని అనేక భాగాలు రక్తహీనత వల్ల కృశించి నశించిపోతాయి. గుండె, మెదడు లాంటి విశేష అవయవాలను అవసరాన్ని మించిన రక్తప్రసరణతో సర్వనాశనం చేస్తుంది.

సామ్యవాదం ఈ రుగ్మతకు చికిత్స చేయాలనుకుంటుంది. కాని, ఓ మంచి ఉద్దేశ్యం కోసం చెడు మార్గాన్ని అవలంబిస్తుంది. వనరుల పంపిణీలో సమతుల్యాన్ని ఏర్పరచడం దాని ధ్యేయం. ఈ లక్ష్యం నిస్సందేహంగా మంచిదే. అయితే ఈ లక్ష్యసాధనకు అది ఎంచుకున్న మార్గాలు వాస్తవానికి మానవ ప్రవృత్తితో యుద్ధం ప్రకటించడం లాంటివి. వ్యక్తుల నుండి వ్యక్తిగత ఆస్తులను దూరం చేసి, కేవలం సమాజానికి బానిసగా చేయడం అన్నది ఆర్థిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు మాత్రమే కాదు, మనిషి సంస్కృతీ నాగరికతలకు సయితం పెద్దఎత్తున నష్టదాయకమయినది.★ ఎందుకంటే ఆర్థిక వ్యవహారాలకు, నాగరిక వ్యవస్థలకు కావలసిన అసలు ఊపిరిని, ప్రేరక శక్తిని నాశనం చేస్తుంది. నాగరిక, ఆర్థిక రంగాల్లో మనిషిని పూర్తి స్థాయి శక్తిసామర్థ్యాలతో పనిచేసేలా ఉత్సాహపరిచే ముఖ్యమైన అంశం అతని వ్యక్తిగత లాభాపేక్ష మాత్రమే.★★

★ దీని నిదర్శనం ప్రపంచం ఇటీవలే చూసుకున్నది కూడా. సోవియట్ యూనియన్‌లో ఈ సామ్యవాద ప్రయోగం విఫలమయి, కేవలం వ్యవస్థ కూలిపోవడమేకాక మొత్తం సోవియట్ యూనియన్‌నే ఛిన్నాభిన్నం చేసివేసింది. ఇప్పుడు ఒక్క రష్యామటుకే స్థిరంగా ఉన్నా అదీ ఎన్నాళ్ళో చెప్పడానికి వీల్లేదు. రష్యాలోనూ కమ్యూనిజం స్థానే పెట్టుబడీ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. రష్యన్ల పని పెణం లోంచి జారి పొయ్యిలో పడ్డట్టయింది.

★★ప్రారంభంలో సామ్యవాదం సైద్ధాంతికంగా ఈ వాస్తవాలను తిరస్కరించింది. దాని అతివాద సిద్ధాంత కర్తలు ఎంతవరకు పోయారంటే 'మనిషి స్వభావసిద్ధంగా ఎలాటి

ఇది మనిషికి సహజమయిన స్వార్థప్రియత్వం. మనిషి నుండి దీన్ని ఏ తర్కమూ వేరుచేయలేదు. అసాధారణ వ్యక్తులు మినహా ఓ సాధారణ స్థాయి మనిషి తన మనస్సును, శారీరక మేధస్సును, శక్తుల్నీ కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకై, తనకు వ్యక్తిగతంగా ఆసక్తి ఉన్న పనులను మాత్రమే చేస్తాడు, చేయగలడు. అసలు ఈ ఆసక్తి లేకనేపోతే, తనకు వచ్చే లాభాన్ని నియంత్రించే హద్దులు నిర్ధారితమై ఉన్నాయనీ, ఆ హద్దులకు మించి అతనెంత కష్టపడినా ఏమీ సంపాదించలేడని తెలిస్తే అతని ఆలోచనా, ఆచరణా సామర్థ్యాలు అంతరించి పోతాయి. అతను కేవలం ఓ కూలివానిలా- తనకు లభించే కూలి మేరకే ఆసక్తిగలిగి పనిచేస్తాడు. ఇది సామ్యవాద వ్యవస్థకు అంతఃరూపం. ప్రైవేటు పెట్టుబడిదారులను అంతంచేసి ఓ పెద్ద సర్కారీ పెట్టుబడిదారుణ్ణి, అంటే సామ్య వాద ప్రభుత్వాన్ని సృష్టించడం అన్నది సామ్యవాదానికి ఆచరణాత్మక బాహ్యారూపం.

ప్రైవేటు పెట్టుబడిదారీ వ్యక్తులలో కొంతయినా కానవచ్చే సున్నితమైన మానవ భావావేశాల స్పృహ అత్యల్ప పరిమాణంలో కూడా ఈ పెద్ద పెట్టుబడి దారుడిలో కానరాదు. ఈ పెద్ద సర్కారీ పెట్టుబడి వ్యవస్థ (సామ్యవాద ప్రభుత్వం) కేవలం ఓ యంత్రంలా పూర్తి వత్తిడితో ప్రజలకు జీవన సామాగ్రిని పంపిణీ చేస్తుంది. ఇక్కడ సానుభూతిగాని, మర్యాద మన్ననగాని ఉండవు. అది మనుష్యుల చేత మనుష్యుల వలె పని చేయించదు, యంత్రంలోని భాగాల్లా పని చేయిస్తుంది. వారి నుండి ఆలోచన, అభిప్రాయ ప్రకటన, ఆచరణల స్వేచ్ఛను పరిహరిస్తుంది. ఈ తీవ్ర దౌర్జన్యకర వ్యవస్థ లేకుండా సామ్యవాదం నెలకొనలేదు, మనజాలనూలేదు.

ధోరణినీ కలిగి ఉండడు, అన్ని భావాలు పరిస్థితుల కారణంగా పుడతాయి. విద్యాశిక్షణలతో వ్యక్తులలో సామూహిక మనస్తత్వాన్ని (Social mindedness) సృష్టించవచ్చు. ఆ మనస్తత్వం స్వార్థపరభావాలు లేనిదై ఉంటుంది' అని అన్నారు. కాని, అనుభవాలు సామ్యవాద మహాశయుల ఈ అపోహను చివరకు ఛిన్నాభిన్నం చేశాయి. ఇప్పుడు రష్యాలో కార్యకర్తలను ఆచరణకై ప్రోత్సహించడానికి వారికి **వ్యక్తిగత ప్రయోజనాల** ఆశ చూపే క్రొత్త పద్ధతి **అనుసరించడ**ం జరుగుతోంది.

ఎందుకంటే ప్రజల సహజ ప్రవృత్తి ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎల్లప్పుడూ తిరగబడడానికి సమాయత్తమయి ఉంటుంది.★

ప్రజల్ని గనక శాశ్వతంగా నియంతృత్వం పంజాల్లో నొక్కి ఉంచకపోతే వాళ్ళు సామ్యవాద వ్యవస్థను చూస్తూ ఉండగానే నిలువునా సమాధి చేసేస్తారు. అందువల్లనే రష్యా ప్రభుత్వం నేటి వరకు ప్రపంచంలోనే పేరుపడ్డ నిరంకుశ, నియంతృత్వ ప్రభుత్వం. తన ప్రజలను ఆ ప్రభుత్వం ఉక్కు పాదాలతో అణచి ఉంచిన తీరు ప్రపంచంలోని మరే ఇతర రాజరిక లేక ప్రజాస్వామ్య ప్రభుత్వాలలోనూ కానరాదు. రష్యా ప్రభుత్వ నిరంకుశత్వానికి, నియంతృత్వానికి కారణం, స్టాలిన్ లాంటి నియంత విధివశాత్తు పుట్టటం కాదు, వాస్తవానికి సామ్యవాద తత్వం స్వతహాగానే ఓ తీవ్రమైన నియంతృత్వాన్ని కోరుతుంది.

ఇస్లామీయ వ్యవస్థ

ఇస్లామ్, పై రెండు ఆర్థిక వ్యవస్థలకు మధ్య స్థిరంగా ఉండే సమతుల్య వ్యవస్థను నెలకొల్పుతుంది. దాని మూలసూత్రం- ప్రతి వ్యక్తికి పూర్తి వ్యక్తిగత, సహజసిద్ధ హక్కులూ లభ్యమవ్వాలి, దాంతోపాటు సంపద పంపిణీలో సమతుల్యాన్నీ కాపాడాలి. ఈ వ్యవస్థ ప్రజలకు ఓ వైపు వ్యక్తిగత యాజమాన్య హక్కును, తన సొమ్మును వాడుకునే అధికారాన్నీ ఇస్తుంది. మరోవైపు ఆ హక్కులు, అధికారాలపై అంతర్యం ద్వారా కొన్ని నైతిక నియమాలను, బాహ్యంలో కొన్ని చట్టపరమయిన ఆంక్షలను ఏర్పరుస్తుంది. వాటి లక్ష్యం ఏమంటే, "సంపద వనరులు అసాధారణంగా ఒకేచోట కేంద్రీకృతం కారాదు. సంపద, దాని వనరులు ఎల్లప్పుడు పరిభ్రమిస్తూ (Rotation) ఉండాలి. ఆ భ్రమణం ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తికి తగిన

★ రచయిత భవిష్యద్ ద్రష్ట అని చెప్పక తప్పదు. నేడు సామ్యవాదం ఆధారంగా ఏర్పడిన సోవియట్ యూనియన్‌లో వచ్చిన ఆర్థిక పరివర్తనలేకాక ఆ రాజకీయ వ్యవస్థ ఛిన్నాభిన్నమయిపోయి వేరుపడిన రాష్ట్రాలు తమ సహజమయిన ధార్మిక, సాంస్కృతిక మూలాల వైపునకు మరలడం మనం కళ్ళారా చూస్తున్నాము (సంవత్సరం-1992).

రూపంలో అతని భాగం లభించాలి.'' ఈ లక్ష్యం కొరకు ఇస్లామ్ ఆర్థిక వ్యవస్థను ఓ క్రొత్త రూపంలో ప్రతిపాదించింది. ఈ వ్యవస్థ దాని మూలం రీత్యా, సూత్రం రీత్యా, విధానాలరీత్యానూ, పెట్టుబడిదారీ, సామ్యవాద వ్యవస్థలు రెండింటికీ భిన్నమయినది.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ గురించి క్లుప్తంగా చెప్పాలంటే- ఒక్కొక్క వ్యక్తి వ్యక్తిగత లాభం, ప్రజలందరి సామూహిక ప్రయోజనం, ఈ రెంటికీ పరస్పర గాఢ సంబంధం ఉంది. అందువల్ల ఈ రెంటి మధ్య వైరుధ్యానికి బదులు సానుకూల్యత, సహకారాలు ఏర్పడాలి. వ్యక్తి ఒకవేళ సామూహిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా కృషి చేసి, సమాజ సంపదను తన వద్ద ప్రోగు చేసుకుని ఆ సంపదను కూడబెట్టడం, ఖర్చు చేయడంలో కేవలం తన సొంత ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుంటే ఈ వైఖరి వల్ల కేవలం సమాజానికే నష్టం కలగదు. పరిణామ ఫలంగా దాని నష్టాలు చివరకు ఆ వ్యక్తిపై కూడా దాపురిస్తాయి. అదే విధంగా ఒకవేళ సమాజ వ్యవస్థ, సామూహిక ప్రయోజనాల కోసం మనిషి వ్యక్తిగత లాభాన్ని బలి తీసుకుంటే పర్యవసానంగా నష్టం కేవలం ఆ ఒక్క వ్యక్తికేగాక సమాజానికి కూడా వాటిల్లుతుంది. సమాజం సౌభాగ్య వంతంగా ఉండటంలోనే వ్యక్తి శ్రేయస్సు ఇమిడి ఉంది. వ్యక్తులు సుఖంగా ఉండటంలోనే సమాజ క్షేమం ఉంది. ఇక రెండూ సుఖంగా ఉండాలంటే వ్యక్తులలో స్వార్థం, సానుభూతి రెండూ తగుపాళ్ళలో ఉండాలి. ప్రతి వ్యక్తి తన వ్యక్తిగత ప్రయోజనాలకై శ్రమపడాలి. కాని అందుకోసం ఇతరులను నష్టపరచరాదు. ప్రతి వ్యక్తి ఎంత సంపాదించగలిగితే అంత సంపాదించాలి. కాని అతని సంపాదనలో ఇతరులకు కూడా హక్కు ఉండాలి. ప్రతి వ్యక్తి ఇతరుల నుండి తానూ లాభాన్ని పొందాలి. ఇతర్షులకూ లాభాన్ని కలుగజేయాలి. ఈ రకమయిన లాభాల పంపిణీ, సంపద భ్రమణం కొనసాగాలంటే కేవలం వ్యక్తుల అంతరంగాల్లో కొన్ని నైతిక సుగుణాలను సృజిస్తే సరిపోదు. దాంతోపాటు రాబడి, ఖర్చులను తగినవిధంగా వ్యవస్థీకరించేందుకు సమాజం చేసిన శాసనమూ కావాలి. దానికి లోబడి, సమాజానికి హాని కలిగించే పద్ధతుల ద్వారా సంపాదించే హక్కు ఎవరికీ ఉండరాదు. అలాగే ధర్మబద్ధ మార్గాల ద్వారా సంపాదించిన

మొత్తాలు ఒకే చోట కేంద్రీకృతం కారాదు. సాధ్యమయినంతగా సంపద భ్రమణం జరగాలి.

ఈ సిద్ధాంతంపై నిర్మితమయిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యం- ఎవరో కొద్ది మంది వ్యక్తులు కోటీశ్వరులు కావడం, మిగిలిన వాళ్ళందరూ పస్తులుండటం కాదు. అలాగే దీని ధ్యేయం-ఎవరూ కోటీశ్వరుడు కాలేకపోవడం, పైగా బలవంతాన ప్రజలందరినీ వారి సహజ భేదాలను కాదని ఒకే మూసలో మలచడానికి ప్రయత్నించడమూ కాదు. ఈ రెండు అతివాదాలకు మధ్యస్థంగా, ఇస్లామీయ వ్యవస్థ లక్ష్యం కేవలం సమాజంలోని వ్యక్తులందరికీ వారి ఆర్థిక అవసరాలు తీరడం, ప్రతి వ్యక్తి ఇతరులకు నష్టం కలిగించకుండా తన సహజ పరిధిలో ఉంటూ ధనం సంపాదించుకునే ప్రయత్నాలు చేస్తూ, తాను సంపాదించిన సొమ్ము నుంచి ఖర్చు చేయడంలో పొదుపును, పరస్పర సహాయాన్నీ దృష్టిలో ఉంచుకుంటే సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో మాదిరిగా ఆర్థిక హెచ్చుతగ్గులు చోటుచేసుకోలేవు. ఎందుకంటే ఈ విధమయిన ఆర్థిక వ్యవస్థ ఒకరిని కోటీశ్వరుడవకుండా అడ్డుకొనకపోయినా అందులో ఆ కోటీశ్వరుడు తన తోటి సోదరులు వేలాది మంది పస్తులకు కారణం కాజాలడు. మరో వైపు ఈ ఆర్థిక వ్యవస్థ దైవదత్తమయిన సంపదలో అందరికీ భాగం కల్పించాలని కోరుతుంది. కాని అర్హత, సామర్థ్యం ఉన్న వ్యక్తి తగు సంపద పొందలేని విధంగా కృత్రిమ మయిన బంధాలను నెలకొల్పడం ధర్మబద్ధమని భావించదు.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ

మనుష్యుల ఆర్థిక జీవనాన్ని సవ్యమయిన, న్యాయబద్ధమయిన మార్గాన నెలకొలపడానికి ఇస్లామ్ కొన్ని నియమాలను, కొన్ని హద్దులను నిర్దేశించింది. ఆ విధంగా ధన సంపాదన, దాని వినియోగం, భ్రమణాల వ్యవస్థ మొత్తం నిర్దేశిత చట్రంలో పనిచేయాలన్నది ఇస్లామ్ అభిమతం. ధన సంపాదనా పద్ధతులు, ధనభ్రమణ పద్ధతులు ఏవై ఉండాలి? ఈ ప్రశ్నతో ఇస్లామ్‌కు ఎలాంటి సంబంధం లేదు. ఈ అంశాలు వివిధ కాలాల్లో నాగరికత అభివృద్ధితోపాటు పుడుతూ,

మారుతూ ఉంటాయి. అవి సహజసిద్ధంగా మనుష్యుల అవసరాలు, పరిస్థితుల ఆధారంగా నిర్ధారితమవుతాయి. అన్ని కాలాల్లోనూ, అన్ని పరిస్థితులల్లోనూ మనుష్యుల ఆర్థిక వ్యవహారాలు ఎలాటి రూపాన్ని సంతరించుకున్నప్పటికీ వాటిలో ఇస్లామీయ నియమాలు వివిధ విధాలుగా నెలకొని ఉండాలని, ఇస్లామీయ హద్దుల పాలన ఖచ్చితంగా జరగాలని ఇస్లామ్ కోరుతుంది.

మనిషి జన్మహక్కు

ఇస్లామీయ దృక్కోణంలో పృధ్విని, దానిపైనున్న సకల వస్తు సంపదను దైవం మనిషి కొరకు సృష్టించాడు. అందువల్ల పుడమి నుండి తన ఆహారాన్ని, జీవికను పొందే ప్రయత్నం చేయడం ప్రతి మనిషికీ జన్మసిద్ధమయిన హక్కు. ఈ హక్కులో మానవులందరూ సమానంగా భాగస్వాములు. ఈ హక్కు నుండి ఎవరినీ దూరం చేయలేము. అలాగే ఎవరికీ ఈ విషయంలో ఇతరులకన్నా ప్రాధాన్యత లేదు. ఏ వ్యక్తి లేదా ఏ జాతి లేదా ఏ తెగపైననూ దానికి ఉపాధి వనరులలో కొన్నింటిని వాడుకునే హక్కేలేదని, లేదా కొన్ని వృత్తులు అసలు చేపట్టనేరాదని నిషేధించడం షరీఅత్ శాసనాంగం ప్రకారం వీలుపడదు. అలాగే ఓ ప్రత్యేక తెగ లేదా జాతి లేదా కుటుంబానికి కొన్ని ఆర్థిక వనరులపై గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టే తారతమ్యాలకూ తావులేదు. దైవదత్తమయిన ఈ భూమిపై దేవుడిచ్చిన సంపాదనా వనరుల నుండి తన భాగాన్ని పొందే ప్రయత్నం చేయడానికి సకల మానవులకు సమానమయిన హక్కు ఉంది. ఈ ప్రయత్నాలు చేసే అవకాశాలు అందరికీ సంప్రాప్తమయి ఉండాలి.

అందరికీ అందుబాటులో అవకాశాలు

ప్రకృతిలోని ఏ వరాల ఉత్పాదనలోనయినా లేక వాటిని వినియోగార్హం చెయ్యడంలోనయినా ఒకరి కృషి, సామర్థ్యాల ప్రమేయం ఉండదో అవి సకల జనులు పొందదగినవి. తన అవసరం మేరకు వాటిని వినియోగించుకునే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంది. నదులూ, చలమలలోని నీరు, అడవులలోని కలప, వాటంతట

అవే పుట్టిన చెట్లు, పండ్లు, దానంతట అదే పెరిగిన గడ్డి, మేత, గాలి, నీరు, అడవి జంతువులు, భూమి పైతలంలో వెలసిన గనులు ఇత్యాదివాటిపై. ఎవ్వరి ఆధిపత్యమూ చెల్లదు, ఎలాటి నియమాలూ విధించ సాధ్యంకాదు. దేవుని దాసులైన మానవులు ఉచితంగానే ఈ సౌభాగ్యాల నుండి తమ అవసరాలను ఈడేర్చుకోవచ్చు. అయితే - వ్యాపార అవసరాలతో ఎవరయినా ప్రైవాటి నుండి ఏదయినా వస్తువును పెద్దఎత్తున వినియోగించుకోవాలని భావిస్తుంటే అలాటివారిపై సుంకం విధించవచ్చు.

మనిషి ప్రయోజనాల కొరకు దైవం సృష్టించిన పదార్థాలను పొందిన తరువాత వాటిని వ్యర్థంగా ఉంచడం ఉచితం కాదు. వాటిని తామన్నా స్వయంగా వాడుకోవాలి, లేదా ఇతరులకయినా వాడుకునే అవకాశమివ్వాలి. ఈ సూత్రం ఆధారంగా, ఏ వ్యక్తీ తన భూమిని మూడు సంవత్సరాలకు మించి బీడుగా విడిచిపెట్టరాదని నిర్దేశిస్తోంది ఇస్లామ్. ఆ భూమిని వ్యవసాయానికిగాని, భవన నిర్మాణానికిగాని లేదా మరే ఇతర పనికిగాని వినియోగించనట్లయితే మూడు సంవత్సరాలు గడిచిన తరువాత ఆ భూమి పరిత్యక్త భూమిగా పరిగణించబడుతుంది. ఏ ఇతర వ్యక్తి అయినా ఆ భూమిని వినియోగించుకుంటే అతనిపై దావా వేయడం కుదరదు. ఇస్లామీయ ప్రభుత్వానికి సయితం ఆ భూమిని వేరొకరికి అప్పగించే అధికారం ఉంటుంది.

యాజమాన్య హక్కులు

ఈ సృష్టి ఖజానా నుండి ఏ వ్యక్తి అయినా నేరుగా ఏదైనా పదార్థాన్ని తీసుకుని తన శ్రమ, శక్తిసామర్థ్యాలతో దానిని వినియోగంలోకి తెచ్చుకుంటే అతను ఆ పదార్థానికి యజమాని అవుతాడు. ఉదాహరణకు, ఎవరి యాజమాన్యం, అధికారం రుజువుకాని బీడుపడి ఉన్న ఏదయినా భూమిని ఎవరయినా వ్యక్తి తన అధీనంలోకి తీసుకుని ఏదయినా ప్రయోజనాత్మకమయిన పనికి దానిని వాడటం మొదలుపెట్టితే అతడిని ఆ భూమి నుండి తొలగించనలవికాదు. ఇస్లామీయ సిద్ధాంతం ప్రకారం ప్రపంచంలోని అన్ని యాజమాన్య హక్కులు ప్రారంభంలో ఈ విధంగానే సంక్రమించాయి. ప్రప్రథమంగా భూమిపై మానవ ఆవాసాలు

ఏర్పడినపుడు అన్ని వస్తువులపై అందరికీ సమాన అధికారం ఉండేది. తరువాత ఏ వ్యక్తి అయితే ప్రయోజనకరమయిన వస్తువులను తీసుకుని కఠిన శ్రమకోర్చి వినియోగంలోకి తెచ్చుకున్నాడో ఆ వ్యక్తి ఆ వస్తువుకు యజమాని అయ్యాడు. అంటే ఆ వ్యక్తికి ఆ వస్తువును తనకోసం వాడుకునే అధికారం ప్రాప్తించింది. ఒకవేళ ఇతరులు ఆ వస్తువును వాడాలనుకుంటే వారి నుంచి దాని ఖరీదు వసూలు చేసే అధికారం అతనికి సిద్ధించింది. మనిషి నిర్వహించే ఆర్థిక వ్యవహారాలన్నింటికీ ఇదీ సహజమైన ప్రాతిపదిక. ఈ ప్రాతిపదికను అలానే ఉండనివ్వాలి.

ఆదరించదగ్గ హక్కులు

ప్రపంచంలో ఎవరికయినా ధర్మబద్ధమైన షరీఅత్ మార్గాల ద్వారా సిద్ధించిన యాజమాన్యపు హక్కులు ముమ్మాటికి ఆదరించదగినవే. ఏ ఆస్తి అయినా షరీఅత్ రీత్యా సరైనదా, కాదా అన్న విషయమే ప్రశ్నించదగినది. షరీఅత్ రీత్యా ధర్మబద్ధంకాని ఆస్తులు నిస్సందేహంగా అంతరించాలి. కాని, షరీఅత్ రీత్యా సరిఅయిన ఆస్తులను జప్తుచేసే లేదా వాటి యజమానుల షరీఅత్‌పరమయిన హక్కులను ఏ విధంగానైనా సరే పరిమితం చేసే అధికారం ఏ ప్రభుత్వానికి లేదా ఏ శాసన సభలకుగాని లేదు. సామూహిక ప్రయోజనాల పేరుతో షరీఅత్ నిర్ధారించిన హక్కులను ధ్వంసం చేసే వ్యవస్థ ఏదీ ఏర్పరచడానికి వీల్లేదు. సామూహిక ప్రయోజనాల కొరకు స్వయంగా షరీఅత్ (ధర్మశాస్త్రం) వ్యక్తుల ఆస్తులపై విధించిన నిబంధనలను సడలించడం ఎంత పెద్ద నేరమో, ఆ నిబంధనల్లో ఏమయినా చేర్చడమూ అంతే పెద్ద నేరం. షరీఅత్ నిర్ధారించిన వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, అలాగే సంఘం మేలు కొరకు షరీఅత్ వ్యక్తులపై విధించిన హక్కులను వసూలు చేయడం ఇస్లామీయ ప్రభుత్వ బాధ్యతల్లో ఒకటి.

సహజసిద్ధమైన సమానత్వం - కృత్రిమ సమానత్వం

దైవం తన వరప్రసాదాల పంపిణీలో సమానత్వాన్ని పాటించలేదు. తన ఔచితీ విజ్ఞతతో కొందరు మనుష్యులకు, మరికొందరిపై ప్రాధాన్యతనిచ్చాడు.

అందచందాలు, మధుర స్వరం, ఆరోగ్యం, శారీరక శక్తి, మేధాశక్తి, జన్మించిన వాతావరణం ఇంకా ఇలాంటి అనేక భాగ్యాలు అందరికీ సమానంగా లభ్యం కాలేదు. జీవిక విషయం కూడా ఇలాటిదే. దైవసృష్టి రీత్యా మనుష్యుల మధ్య జీవిక విషయంలో వైవిధ్యం ఉండటం అన్నది అవసరం. కాగా, మనుష్యుల మధ్య కృత్రిమ ఆర్థిక సమానత్వాన్ని ఏర్పరచడానికి ఉద్దేశించిన పద్ధతులన్నీ ఇస్లామీయ దృక్పథం ప్రకారం, లక్ష్యపరంగానూ, సైద్ధాంతికంగానూ సరిఅయినవి కావు. ఇస్లామ్ వాంఛించే సమానత్వం జీవికలో సమానత్వం కాదు, జీవిక కొరకు శ్రమించే అవకాశాల సమానత్వం. ఏ వ్యక్తి అయినా సరే తన శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా ఆర్థిక కృషి జరపకుండా నిరోధించే చట్టపరమయిన, ఆచారపరమైన అవాంతరాలు సమాజంలో ఉండరాదని ఇస్లామ్ కోరుతుంది. అలాగే కొన్ని జాతులకు, తెగలకు, వంశాలకు, కుటుంబాలకు జన్మసిద్ధంగా భోగభాగ్యాలను, శాశ్వత చట్టపరమయిన రక్షణగా మార్చివేసే భేదభావాలు కూడా ఉండరాదని ఇస్లామ్ వాంఛిస్తుంది. ఈ రకమయిన రెండు పద్ధతులూ సహజ అసమానత్వం స్థానే బలవంతంగా కృత్రిమ సమానత్వాన్ని ఏర్పరుస్తాయి. అందువల్ల ఇస్లామ్ వీటిని రూపుమాపి సమాజంలో ప్రతి మనిషికీ శ్రమించే అవకాశాలు సులభంగా లభ్యమయ్యేలా సమాజంలో ఆర్థిక వ్యవస్థను సహజసిద్ధమయిన స్థితిలో తీర్చిదిద్దగోరుతుంది.

శ్రమించే అవకాశాల్లోనూ శ్రమ ఫలితాల్లోనూ అందరినీ బలవంతంగా సమానం చేయాలని కోరేవారి వాదనతో ఇస్లామ్ ఏకీభవించదు. ఎందుకంటే, వారు సహజ అసమానత్వాన్ని, కృత్రిమ సమానత్వంగా మార్చాలనుకుంటున్నారు. దైవం తనను సృష్టించిన పరిస్థితులలో; పుట్టించిన స్థాయిలోనే ప్రతి మనిషి ఆర్థిక రంగంలో పోటీ ప్రారంభించే ఆర్థిక వ్యవస్థ మాత్రమే మనిషి సహజ ప్రవృత్తికి దగ్గరగా ఉంటుంది. పుట్టుకతోనే మోటారు వాహనాన్ని పొందిన వ్యక్తి మోటారు వాహనంపైననే వెళతాడు. కేవలం రెండు కాళ్ళ ఆధారం మాత్రమే ఉండి పుట్టిన వ్యక్తి తన కాళ్ళపైననే నడక సాగించాలి. కుంటివానిగా పుట్టినవాడు కుంటుతూనే ముందుకు సాగాలి. మోటారు వాహనం వాడికి ఆ వాహనంపై శాశ్వత అధికారం

ఇచ్చే శాసనాలు సమాజంలో ఉండరాదు. అలాగే కుంటివానికి మోటారు వాహనం ప్రాప్తించడం అసాధ్యమూ కారాదు. అంతేకాదు, ఈ పరుగు పందెం అందరూ ఒకచోటి నుండి ప్రారంభించాలని, ఒకే పరిస్థితిలో పరుగెత్తాలని, అంతం వరకు తప్పనిసరిగా కలిసే పరుగెత్తాలని బలవంతపెట్టడమూ జరగరాదు. కుంటుతూ పరుగు ప్రారంభించిన వ్యక్తి శ్రమ, కృషి జరిపి మోటారు వాహనం పొందగలిగితే, ఆ అవకాశమూ లభించాలి. అలాగే మోటారు వాహనంతో పరుగులో పాల్గొన్న వ్యక్తి అసమర్థత, అయోగ్యత చూపి కుంటుబడితే అతనికి ఆ గతే పట్టాలి. శాసనాల్లో ఈ స్వేచ్ఛ, అవకాశాలుండాలి.

పరస్పర సహకారానికి సహజ పద్ధతులు

సామూహిక జీవనంలో ఈ ఆర్థిక పరుగు పందెం స్వేచ్ఛగా పగ్గం లేకుండా సాగడం మాత్రమే ఇస్లామ్ కోరదు. ఈ పందెంలో పాల్గొనే వాళ్ళు ఒండొరులపై దయ, జాలి లేనివారిగా ఉండరాదని కూడా అభిలషిస్తుంది. వాళ్ళు పరస్పరం సానుభూతిపరులుగా, సహాయకారులుగా ఉండాలి. ఇస్లామ్ ఓ వైపు తన నైతిక బోధనతో వెనుకబడిన, దుర్దశలో ఉన్న సోదరులకు ఆసరా ఇచ్చేలా ప్రజల మనస్తత్వాన్ని తీర్చిదిద్దుతుంది. మరో వైపు శ్రామికులకు, అసహాయులకు మద్దతునిచ్చే బాధ్యతను మోసే ఓ శాశ్వత సంస్థ సమాజంలో ఉండాలని వాంఛిస్తుంది. ఆర్థిక పరుగులో పోటీ చేయగల సామర్థ్యం లేనివాళ్ళు ఆ సంస్థ నుండి తమ భాగాన్ని పొందగలరు. సందర్భవశాన ఈ పరుగు పందెంలో జారిపడిన వారిని ఈ సంస్థ లేపి, మళ్ళీ నడిచేందుకు సిద్ధపరచాలి. ఈ పోరాటంలో పాల్గొనడానికి ఆసరా అవసరమయినవారికి ఈ సంస్థ ద్వారా ఆసరా లభించాలి. ఈ లక్ష్యసాధనకు ఇస్లామ్ చట్టబద్ధంగా దేశంలో ప్రోగుపడ్డ మొత్తం సంపద నుండి రెండున్నర శాతం, అలాగే మొత్తం వ్యాపార పెట్టుబడిపై రెండున్నర శాతం సాలీనా 'జకాత్' వసూలు అయ్యేలా నిర్దేశించింది. వ్యావసాయిక భూముల ఉత్పత్తులపై పది శాతం లేక అయిదు శాతం, కొన్ని ఖనిజ ఉత్పత్తులపై ఇరవై శాతం జకాత్, నిర్దేశిత పశు సంపదపై నిర్దేశిత జకాత్ ప్రతి సంవత్సరం వసూలు చేయాలి. ఈ రకంగా జమ అయిన మొత్తాన్ని నిరుపేదలకు, అనాధలకు, అగత్యపరులకు

సహాయమందించటంలో ఉపయోగించాలి. ఇస్లామీయ సమాజంలోని ఏ వ్యక్తీ తన జీవితంలో కనీస అవసరాలు తీరనివాడిగా ఉండరాదు. అది అలాంటి ఓ సామూహిక ఇన్సూరెన్స్. పస్తులుండవలసిన భయంతో కార్ఖానాదారులు, జమిందారులు విధించిన షరతులన్నిటినీ అంగీకరించే నిస్సహాయ స్థితిలో ఏ శ్రమైకజీవి ఎన్నడూ ఉండనవసరముండదు. ఆర్థిక రంగంలో పోటీపడడానికి అవసరమైన కనీస ప్రమాణంకన్నా తక్కువ స్థాయికి ఏ వ్యక్తి శక్తి పడిపోకుండా ఈ వ్యవస్థ కాపాడుతుంది.

వ్యక్తి స్వేచ్ఛకు మన్నన

ఇస్లామ్ వ్యక్తి, సమాజాల మధ్య సమతుల్యాన్ని నెలకొల్పుతుంది. అందులో మనిషి వ్యక్తిత్వం, అతని స్వేచ్ఛకు భంగం కలగని విధంగా, సామూహిక ప్రయోజనాలకు వ్యక్తి స్వేచ్ఛ నష్టదాయకం కాకపోవడమేకాక లాభదాయకంగా ఉండేలా దాన్ని రూపొందిస్తుంది. వ్యక్తి సమాజంలో సంవిలీనమయి గుర్తింపు లేకుండా చేసే, అతని వ్యక్తిత్వపు నిజమయిన అభివృద్ధికి అత్యవసరమయిన స్వేచ్ఛను హరించివేసేటటువంటి రాజకీయ, ఆర్థిక వ్యవస్థను ఇస్లామ్ ఇష్టపడదు. ఏ దేశంలోనయినా ఉత్పాదక వనరులన్నింటినీ జాతీయ ఆస్తిగా ప్రకటిస్తే తప్పనిసరి ఫలితంగా దేశంలోని ప్రజలందరూ సామాజిక బంధాల్లో నలిగిపోతారు.

ఆ పరిస్థితిలో వ్యక్తిత్వం మనుగడ, వృద్ధి అత్యంత దుర్లభం, కాదు అసాధ్యం. వ్యక్తిత్వ వికాసానికి రాజకీయ స్వేచ్ఛ ఎలా అవసరమో అదే విధంగా ఆర్థిక స్వేచ్ఛ కూడా చాలా వరకు అవసరం. మనం మానవత్వాన్ని పూర్తిగా ధ్వంసం చేయరాదని భావిస్తే, మన సామూహిక జీవితంలో, ప్రతి మనిషి తన జీవికను స్వేచ్ఛగా సంపాదించుకుంటూ తన అంతరాత్మను నిలకడగా నిలబెట్టుకునే కనీస అవకాశం ఉండాలి. ఇంకా ప్రతి వ్యక్తి తన మేధా శక్తిని, నైతిక శక్తిని తన అభిరుచులకు అనుగుణంగా వికసింపజేసుకోగలగాలి. ఇతరుల చేతిగుండా లభించే దినభత్యం లాంటి జీవిక, బాగా పుష్కలంగా లభించినా వాంఛనీయం మాత్రం కాదు. ఎందుకంటే ఈ రకమయిన బ్రతుకుతెరువు వల్ల పరుగు ఆగిపోతుంది. కేవలం బలుపు ఆ నష్టాన్ని పూరించలేదు.

కళ్ళెంలేని స్వేచ్ఛకు అడ్డుకట్ట

ఏ విధంగానైతే ఇస్లామ్ వ్యక్తి స్వేచ్ఛను హరించివేయడం ఇష్టపడదో అదే విధంగా మనిషికి సామాజికంగా, ఆర్థికంగా, హద్దుల్లేని స్వేచ్ఛనిచ్చే వ్యవస్థను, వారికి తమ కోరికల కోసం, ప్రయోజనాల కోసం రాజ్యాన్ని ఇష్టానుసారం నష్టపరచే హక్కు నిచ్చే వ్యవస్థను కూడా వ్యతిరేకిస్తుంది.

రెండు తీవ్రవాదాలకు మధ్యస్థంగా ఇస్లామ్ సమాజం కోసం వ్యక్తిపై కొన్ని హద్దులను, కొన్ని బాధ్యతలను మోపుతుంది. ఆ తరువాత అతని సకల వ్యవహారాల్లో స్వేచ్ఛనిస్తుంది. ఈ హద్దులను, బాధ్యతలను వివరంగా చెప్పే అవకాశం ఇక్కడ లేదు. వాటికి సంబంధించిన సంక్షిప్త రూపం మీ ముందుంచుతాను.

ధర్మమైన, అధర్మమైన ఆర్జన

ముందు ఉపాధి సముపార్జననే తీసుకోండి. ధనం సంపాదించే మార్గాల ధర్మాధర్మాలకు సంబంధించిన వివరాలను ఇస్లామ్ వివరించినంత సూక్ష్మంగా ప్రపంచంలోని ఏ చట్టమూ చెప్పలేదు. ఓ వ్యక్తి ఇతర వ్యక్తులను లేదా పూర్తి సమాజానికి నైతికంగానూ, భౌతికంగాను నష్టపరచి తన జీవికను సంపాదించే మార్గాలనన్నింటినీ ఒక్కొక్కదాన్ని పేరు పేరున సూచించి అధర్మమయినదిగా నిర్ణయిస్తుంది. మద్యం, మాదక ద్రవ్యాలను తయారుచేయడం, అమ్మడం, అశ్లీలం, నీతిబాహ్యమయిన కార్యకలాపాలు, నృత్య, గాన వృత్తులు, జూదం, మట్కా, లాటరీ, వడ్డీ, మోసం, ద్రోహం, వివాదాస్పద వ్యవహారాలు ఖచ్చితంగా ఓ పక్షానికి లాభం, మరో పక్షానికి నష్టం చేకూర్చే వ్యాపార పద్ధతులు, నిత్యావసర వస్తువుల్ని దాచిపెట్టి ధరలు పెంచడం, ఇంకా సామాజికంగా హానికరమైన వ్యాపార వ్యవహారాలు అన్నీ ఇస్లామీయ చట్టంలో నిర్ద్వంద్వంగా నిషేధించబడ్డాయి.

ఇస్లామీయ ఆర్థిక శాసనాల్ని పరిశీలిస్తే నిషేధిత పద్ధతుల ఓ లిస్టు మన ముందుకు వస్తుంది. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తులు ఏ పద్ధతులనయితే ఉపయోగించి కోటీశ్వరులవుతున్నారో ఆ పద్ధతులు అనేకం ఆ లిస్టులో

దొరుకుతాయి. ఇస్లామ్ ఆ పద్ధతులన్నింటినీ చట్టబద్ధంగా అంతం చేస్తుంది. ఇతరులకు లాభకరమయిన సేవలందించి వాటికి ప్రతిఫలాన్ని న్యాయంగా సాధించే విధానాల ద్వారా మాత్రమే సంపాదించుకునే స్వేచ్ఛను మనిషికి ఇస్తుంది ఇస్లామ్.

రాబడి ఖర్చులపై ఆంక్షలు

ధర్మబద్ధంగా సంపాదించిన ఆస్తిపై మనిషి యాజమాన్య హక్కును అంగీకరిస్తుంది ఇస్లామ్. అయితే, ఈ హక్కు హద్దుల్లేనిది కాదు. ధర్మబద్ధ సంపాదనను ధర్మబద్ధంగానే ఖర్చు చేయాలని ఆంక్షలు విధిస్తుంది ఇస్లామ్. ఖర్చులపై ఇస్లామ్ విధించిన ప్రతిబంధకాల వల్ల మనిషి పవిత్రంగా జీవితాన్ని గడపగలుగుతాడే తప్ప భోగవిలాసాలలో డబ్బును నీళ్ళప్రాయంగా ఖర్చు చేయలేడు. ఫ్యాషన్ల మోజులో, హోదా దర్పాల ప్రదర్శనాభిలాషలో తన 'దైవత్వపు ముద్రను' ఇతరులపై వేయగలిగినంతగా హద్దులను మీరలేడు. కొన్ని రకాల దుబారా ఖర్చులనయితే ఇస్లామ్ పూర్తిగా నిషేధించింది. మరి కొన్నింటిపై నిషేధించే స్పష్టమయిన ఆదేశాలయితే లేవు కాని, ప్రజలు తమ సంపదను అక్రమ మార్గాన వాడుకోకుండా శాసనబద్ధంగా అడ్డుకొనే అధికారం ఇస్లామీయ ప్రభుత్వానికి ఉంది. ధర్మబద్ధమైన, సక్రమమైన ఖర్చులు పోగా మిగిలిన సొమ్మును మనిషి కూడబెట్టుకున్నా తప్పులేదు. లేదా మరింత సంపాదించడానికి ఆ సొమ్మును వాడుకున్నా తప్పులేదు. అయితే ఈ రెండు హక్కులపై నిబంధనలున్నాయి. కూడబెట్టుకోవాలనుకున్నప్పుడు ఆ వ్యక్తి నిర్దేశిత సొమ్ముకన్నా ఎక్కువగా ఉన్న మొత్తంపై రెండున్నర శాతం సాంవత్సరిక జకాత్ ఇవ్వవలసి ఉంటుంది. వ్యాపారంలో వాడుకోవాలనుకుంటే కేవలం ధర్మబద్ధమయిన వ్యాపారంలో మాత్రమే వాడాలి. ధర్మబద్ధ వ్యాపారం స్వయంగా ఆ వ్యక్తి నిర్వహించినాలేక ఇతరులకు పెట్టుబడిగా రూపాయలను, యంత్రాలను, భూమిని ఇచ్చి లాభనష్టాల్లో భాగస్వామ్యం పొందినా- ఈ రెండు విధానాలూ ధర్మబద్ధమయినవే.

ఇస్లామీయ హద్దుల్లో శ్రమించి ఏ వ్యక్తి అయినా కోటీశ్వరుడు

అయిపోయినా అందులో అభ్యంతరమేదీ లేదు. అది దైవకటాక్షమే. కాని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా ఇస్లామ్ ఆ వ్యక్తిపై రెండు షరతులను విధిస్తుంది. ఒకటి, ఆ వ్యక్తి తన వ్యాపార సంపదపై జకాత్‌ను, వ్యావసాయిక ఉత్పత్తులపై 'ఉష్ర్'ను చెల్లించాలి. రెండు, అతను తన వ్యాపారం లేదా పరిశ్రమ లేదా వ్యవసాయంలో చేర్చుకున్న భాగస్వాములతో లేదా శ్రామికులతో న్యాయంగా వ్యవహరించాలి. ఒకవేళ ఆ వ్యక్తి న్యాయం చేయకున్నట్లయితే ఇస్లామీయ ప్రభుత్వం అతనిపై ఒత్తిడి తెచ్చి అతడిని న్యాయానికి ఒప్పిస్తుంది.

సంపద విస్తరణ

ఈ ధార్మిక హద్దుల్లో సంక్రమించిన సంపదను కూడా ఇస్లామ్ చాలా కాలం ప్రోగుపడి ఉండనివ్వదు. వారసత్వపు శాసనాల ద్వారా తరం తరువాత తరానికి ఆ సంపదని విస్తరింపజేస్తుంది. ఈ విషయంలో ఇస్లామీయ శాసనాల ధోరణి ప్రపంచంలో ఇతర శాసనాల ధోరణులకు విభిన్నమయినది.

ఓసారి ప్రోగుపడ్డ సంపద తరతరాలకు అలాగే ఉండేలా చూస్తాయి ఇతర శాసనాలు. దీనికి భిన్నంగా ఇస్లామీయ శాసనం ప్రకారం ఓ వ్యక్తి తన జీవితంలో సంపాదించిన సంపదను అతని తరువాత అతని వారసుల్లో పంచివేయడం జరుగుతుంది. దగ్గర బంధువులు వారసులుగా లేకపోతే దూరపు బంధువులు వారసులవుతారు. దూరపు చుట్టాలూ లేకపోతే పూర్తి ముస్లిమ్ సమాజానికి ఆ సంపదపై హక్కు ఏర్పడుతుంది.

ఈ శాసనం ఏ జాగీరుదారీని లేదా జమిందారీని శాశ్వతంగా ఉండనివ్వదు. ఇన్ని ప్రతిబంధకాలు (ముందు పేర్కొన్న ఆంక్షలు) ఉన్నప్పటికీ సంపద ప్రోగుపడటం వల్ల ఏమయినా రుగ్మతలు తలెత్తినా ఆఖరు దెబ్బ ఆ రుగ్మతలన్నింటినీ తుడిచి వేస్తుంది.

- : సమాప్తం : -